# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 39 సంచిక 5

పేజీలు 44

జనవరి 2020

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** .............................. ....... **పేజీ**


శ్రీకృష్ణ కర్ణామృతము ....................4

శ్రీబాబూజీ ఉవాచ.................... 5

అమ్మమాట.................... 7

రామాయణంలో స్త్రీ పాత్రలు ....................9

సత్సంగామృతం 3 ....................11

గురుకృప .................... ....................14

గీతా సారం . .......... ....................17

తెలివిగల వారే ఉన్నత పదవులకు అర్హులు ................ 20

దేవునితో బేరం .... .. .................... ....21

శ్రీ కృష్ణం వందే జగద్గురుమ్ ....................25

తిరుప్పావై .................... . ....................28

గుర్వష్టకమ్ ....................30

భజ గోవిందమ్ .................... ....................32

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................34

చిల్లుల కుండ .......... ....................35

కైవల్యోపనిషత్ ... ....................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... .................... ....................41

# శ్రీ కృష్ణ కర్ణామృతము - సుశీలా ప్రసాద

**తృతీయాశ్వాసము - 84 వ శ్లో॥**

**పుల్లేన్దీవరకాన్తి మిన్దువదన బర్హావతంస ప్రియమ్,**
**శ్రీవత్సాఙ్క ముదార కౌస్తుభ ధర పీతామ్బర సున్దరమ్,**
**గోపీనాం నయనోత్పలార్చిత తనుమ్, గోగోప సఙ్ఘావృతమ్**
**గోవిన్దం కల వేణునాదనిరత దివ్యాఙ్గ భూషం భజే॥**

**తాత్పర్యము -**



వికసించిన నల్లకలువల యొుక్క కాంతిగలవాడును, చంద్రుని వంటి వోమము కలవాడును, నెమలి పింఛమను శిరోభూషణమే ఇష్టమైనదిగా కలవాడును, శ్రీవత్సమను పుట్టుమచ్చగలవాడును, గొప్పదియగు కౌస్తభమను మాణిక్యమును ధరించినవాడును, పచ్చని వలువకలవాడును, అందమైనవాడును, గోపికల యొుక్క నేత్రములనెడి కలువ పువ్వులచేత పూజింపబడిన దేహము గలవాడును, అవ్యక్త మధురమైన వేణునాదమందు ఆసక్తిగలవాడును, సర్వోత్తమములైన అవయవములందలి ఆభరణములు గలవాడును అగు శ్రీకృష్ణుని నేను సేవించుచున్నాను.

1. మనలోనే వున్న మధుకైటభులెవరు?
2. గురు ఋణం తీర్చుకోవడం ఎలా?
3. భగవంతుడిని ఏ స్థాయిలో భావించాలి?
4. భగవంతుడితో బేరం ఆడితే ఎలా వుంటుంది?
5. శ్రీకృష్ణుడు దోచుకున్న వెన్నమీగడలు ఏవి?
6. పరమాత్మను పొందటానికి అధికారులెవరు?
7. మహాత్ముల దృష్టి ఎలా వుంటుంది?
8. ప్రపంచ విషయాలపై విరక్తి ఎలా కలుగుతుంది?
9. ఆత్మానుభూతిని ఎలా పొందగలము?
10. పాతివ్రత్య మహిమ వలన దైవాన్ని కూడా బంధించగలిగినది ఎవరు?

***సమాధానాలు లోపలి పేజీలలో........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

రామదాసుగారు మాట్లాడుతూ, 'నామనస్సు శ్రీరామచంద్రుని తప్ప ఇతర విషయాదులను వాంఛించదు. కాబట్టి నేను ప్రచారం చేసే సమయంలో ప్రాపంచిక విషయాలపై నా మనస్సు పోకుండా నా హృదయంలో నీవే నిలిచి ఉండాలి. అందరి యందును నేను రామప్రభువునే దర్శించాలి. నేను ప్రచారంచేసే సమయంలో అందరిలోనూ నేను మంచినే చూడాలి. అంతేకాక నా కర్తవ్యం పూర్తయిన పిమ్మట, నన్ను నీలో ఐక్యం చేసుకోవాలి' అంటాడు.



శ్రీరామచంద్రుడు సంతోషించి సమర్థరామదాసుని కౌగిలించుకొని ఆయన షరతులను సమర్థిస్తాడు. అప్పటినుండి సమర్థ రామదాస్ శ్రీరామనామ ప్రచారం చేస్తాడు.

శ్రీరామదాసుగారి శిష్యులలో ఉత్తముడు శివాజీ చక్రవర్తి. ఆయన యోగభ్రష్టుడు. అందుచేతనే చక్రవర్తిగా జన్మించాడు. తన సామ్రాజ్యాన్ని యావత్తు గురుదేవునికి ధారపోస్తాడు. గురుపాదుకలను సింహాసనంపై ఉంచి దేశాన్ని పాలిస్తాడు. శివాజీ చక్రవర్తి గురుకృప వలన అనేక పర్యాయాలు రక్షింపబడతాడు.

సమర్థ రామదాస్ ఒకసారి తన శిష్యులతో శివాజీని దర్శించటానికి వెళుతుండగా, మార్గమధ్యంలో వారికి విపరీతంగా ఆకలివేస్తుంది. ఆ ఆకలి బాధలకు తట్టుకొనలేక వారి శిష్యులు ఆ సమీపంలో ఉన్న చెరకుతోటలో ఉన్న చెఱకు గడలను తినాలని సంకల్పిస్తారు. కాని సమర్థరామదాసుగారు మాత్రం 'తోట యజమానికి తెలియజేయకుండా అలా చెఱకుగడలను తినడం మహాపరాధము' అని చెప్తారు.

గురువుగారు ధ్యానంలో నిమగ్నమైన సమయం చూసి శిష్యులంతా తోటలోకి చొరబడి, కావలసినన్ని చెఱకుగడలను తిని, రెండు గడలను మాత్రం ధ్యానం చేసుకొనుచున్న గురుదేవుని సమీపంలో వుంచారు.

ఇంతలో ఆ తోట యజమాని వచ్చాడు. పరిస్థితిని తెలుసుకున్న తర్వాత శ్రీరామదాసుగారి శిష్యులను, గురువుగార్ని కూడా కొట్టాడు. రామదాసుగారికి గట్టిదెబ్బలు తగిలాయి. విషయం తెలుసుకున్న శివాజీ తన గురుదేవులైన రామదాసుగారిని వెంట తీసుకొనివెళ్ళి, సపర్యలుచేసి తన గురుదేవులను కొట్టిన పాపాత్ముడిని పట్టి తీసుకువచ్చి శిరచ్ఛేదము చేయమని ఆజ్ఞాపించాడు.

ఆ చర్యకి రామదాసుగారి శిష్యులు సంతోషిస్తారు, కాని సమర్థ రామదాసుగారు మాత్రం దానికి అంగీకరించరు. తప్పు చేసినది తన శిష్యులే అని, రైతునకు నష్టం కలిగింది కాబట్టి రైతునకు నష్టపరిహారంగా కొంత పైకం ఇవ్వమని ఆజ్ఞాపిస్తాడు.

శివాజీ యోగభ్రష్టుడు, గురుదేవులంటే ఎంతో భక్తి, ప్రేమ కాబట్టి ఆయన ఆజ్ఞ మీరతాడా! అందువల్లనే ఆయన ఆజ్ఞను శిరసావహిస్తాడు. మహాత్ముల దృష్టి అలా ఉంటుంది. అందుచేతనే ధర్మము రక్షింపబడుతుంది. రైతు రామదాసుగారి క్షమాగుణానికి ముగ్ధుడై, ఆయన పాదములపై పడి క్షమించమంటాడు.

అటువంటి బ్రహ్మమూర్తులైన మహాత్ములను ఆశ్రయించిన పాలకుల పరిపాలనలో అన్యాయానికి తావు ఎక్కడిది? ఏ న్యాయశాస్త్రం అటువంటి ధర్మస్థాపన చేయగలుగుతుంది? నేరాన్ని శిక్షించినంత మాత్రాన ధర్మస్థాపన జరుగుతుందా? ప్రజలలో చైతన్యం కలుగుతుందా? గురువుపై విశ్వాసం కలుగుతుందా? కాబట్టి అటువంటి కారణజన్ములైన గురుదేవులను ఆశ్రయించాలి. వారిని విశ్వసించాలి. వారు ఇచ్చిన లక్ష్యార్థాన్ని సాధించాలి. వారి శక్తిని ఎన్నడూ శంకించరాదు" అని ముగించారు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## సాధన ఎలా చేయాలి?

మనం అనేక కార్యక్రమాలు పెట్టుకుని, అనేకానేక పారాయణలు, ఇన్ని ఉపనిషత్తులు చదువుతున్నామంటే, ఇవన్నీ మన మనసుని ఒక క్రమశిక్షణలో పెట్టడంకోసమే గాని, దీని వలన భగవంతుడికి (గురుదేవుడికి) ఏమీ ఒరగదు. మనం మన చర్మం ఒలిచిపెట్టినా గురు ఋణం తీర్చుకోలేము. మనకి బద్ధకం ఆవరించకుండా వుండటానికి ఈ పారాయణలు అవీ చేయాలి. 'గురుమూర్తి చెప్పినది ఒక్క ముక్క ఆచరించగలిగినా చాలు. నా ఋణం తీర్చుకో గలుగుతారు' అనేవారు స్వామి.



సాధకుడు తన సాధనలో ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కుతూ వుంటే, ఎంతో జాగ్రత్తతో వినమ్రత కలిగి వుండాలి. ముందు ముందు మనం చేసే సాధన, అణిగిమణిగి వుండటం - ఇవే మనకి రక్షణ.

బాబు ఎంతో వినయ పూర్ణుడు. 'నేను జ్ఞానిని కాదు, పరమహంస స్వరూపుడిని కాదు, భక్తుడిని కాదు, చదువుకున్న వాడినీ కాదు. నేను భగవద్భక్తుల యొక్క దాసాను దాసుడను' అని చెప్పేవారు సద్గురుదేవులు.

సద్గురుమూర్తితో పొందిన అనుభవాలు వారి దివ్యబోధ, వారి స్మృతులు మనఃపూర్వకంగా తలచుకోండి. ఆయన మన కోసం ఎంత కష్టపడ్డారు! తమ సర్వస్వం మనకి త్యాగం చేశారు. 'దేవుడున్నాడని నమ్మండి. గురుదేవుడే ఈశ్వరుడు అని విశ్వాసం పెంపొందించుకోండి' అని చెప్పారు శ్రీబాబు. కృష్ణుడేమని చెప్పాడు? 'ఇతర చిల్లర దేవుళ్లని నమ్మకండి. నన్ను పూజించండి' అని చెప్పాడు.

గురుదేవుడు 'అద్వైత సామ్రాజ్య చక్రవర్తి.' ఈ బాహ్యపూజలకు లొంగడాయన. 'అయితే మేము పూజలు చేయనక్కర్లేదాండీ?' అని

అడుగుతారు మీరు. మన మనసులని కంట్రోల్ లోకి తేవడానికి మనం బాహ్యా పూజలు, జపధ్యానాదులు, పారాయణలు చేయవలసినదే. మన గమ్యం చేరేంత వరకూ సాధన చేయవలసినదే. అయితే మనం పూజ చేసేటప్పుడు మన మనసును వుంచి చేయాలి. స్పీడుగా నామాలు చదువుకుంటూ వెళ్ళిపోవడం, ఎన్ని లక్షల పుష్పాలు పూజ చేస్తున్నామని కాదు పూజ అంటే. ఒక నామానికి మరొక నామానికి మధ్య మనస్సు (సంకల్పం) రాకూడదు. 'ఓం దుర్జయాయ నమః - దుఃఖాన్ని దుష్కృతాన్ని జయించినవాడు కదా నా గురుదేవుడు! 'ఓం సదాచారాయ నమః' - అంటే 'ఓహో! ఆయన కూడా ఆచారం పాటిస్తారన్నమాట! ఆయన ఆచారం ఏమిటి? నిరంతరం మనసుని సత్యమునందే వుంచడం ఆయన ఆచారం.

ఈ విధంగా ఆ నామంలో మన మనసు లయించాలి. ఒక్కొక్క పుష్పం ఆ స్వామి దివ్యచరణారవిందములపై వేస్తున్నామంటే, ఆ పుష్పంతో పాటు మనలోని ఒక్కొక్క సంకల్పాన్ని ఆ స్వామి పాదాలకి సమర్పించు కుంటున్నట్లుగా భావించాలి. అదే అసలయిన పూజ. ఆ స్వామికి దండలు అలంకారం చేసి, ఆ ఆనందాన్ని మనమే అనుభవిస్తున్నాం. కనీసం ఈ విధంగానైనా మనకోసం కష్టపడిన ఆ స్వామిని తలచుకుని ఆనందిస్తున్నాం.

'ప్రసాదం' అంటే 'ప్రకృష్ట సాధన దదాతి - యితి ప్రసాదః' అని అర్థం. అంటే ఎంతో ప్రకృష్టమైన సాధనని ప్రసాదించేది 'ప్రసాదం' అని అర్థం. ఈనాడు మనమనుభవిస్తున్నదంతా కూడా ఆ సద్గురుమూర్తి ప్రసాదించిన అనుగ్రహం. మనం దానిని పూర్తిగా జుర్రుకోవాలి.

ఫ్యాన్ ఎంత వేగంగా తిరిగితే అంత కరెంటు వస్తుందో, మనం కూడా మన మనస్సులలోకి ఏ సంకల్పమూ, ఏ విషయాదులూ చొరబడకుండా వుండటం కోసం, గురు నామాన్ని అంత స్పీడ్‌గా అంటే నామానికీ నామానికీ మధ్య సంకల్పం రాకుండా వుండటమని యింతకు ముందరే చెప్పుకున్నాం. గురువాక్యాన్ని అలా ఆచరించాలి.

-సశేషం

# రామాయణంలో స్త్రీ పాత్రలు

(గత సంచిక తరువాయి) - సుషమ్నా ప్రసాద

## సుమిత్ర

కౌసల్యను ఓదారుస్తూ ఇలా మాట్లాడింది ...'అక్కా! నువ్వెందుకలా దుఃఖిస్తున్నావు? దైన్యముతో బాధపడతావెందుకు? రాముడు సకల సుగుణాభిరాముడు. పురుషశ్రేష్ఠుడు. ఇహపరములందు కీర్తిని ప్రసాదించే ధర్మాన్ని వదలని పుణ్య చరితుడు. అలాంటి రాముని గురించి నీవెందుకు బాధపడతావు?

రామునికి ఏ లోటు వుందని నీవు బాధపడుతున్నావు? రాముని తండ్రిలా సేవించి, కంటికి రెప్పలా కాపాడుకునే నా బిడ్డ లక్ష్మణుడు తోడుగా వెడుతున్నాడు. అరణ్యంలోని కష్టాలన్నీ చక్కగా అవగాహన చేసుకొన్నవాడు. రాముడు పితృవాక్య పరిపాలకుడు. ధర్మబద్ధుడై, వనవాసానికి వెడుతున్నాడు కాని, చేతకానివాడై కాదు. తండ్రిని సత్యవాక్పరిపాలకుడుగా నిలబెట్టడానికి కష్టాలను కోరితెచ్చుకున్నాడు.

**కీర్తిభూతాం పతాకాం యో లోక భ్రమయితి ప్రభుః**

**ధర్మ సత్యవ్రత పరః కిం వ ప్రాప్తి స్తవాత్మజః ॥**

ధర్మ సత్యములే ధనమని భావించిన సమర్థుడైన నీ బిడ్డ కీర్తిపతాకాన్ని ఈ లోకంలో ఎగురవేస్తున్నాడు. అతనికి కొరత ఏమున్నది? అతనికందని ఫలమేమున్నది? ఈ శ్లోకంలో సుమిత్ర భావగర్భితంగా దివ్యమైన భాష్యం చెప్పింది. కీర్తిపతాకాన్ని ఎగురవేసిన వాడే ప్రభువని కొత్త నిర్వచనాన్ని యిచ్చింది. స్ఫూర్తి, లేక కీర్తి, లేక దీప్తి లేని రాజు ప్రజల పాలిట దురదృష్టమని ఆమె అభిప్రాయము. సుమిత్ర ఎంత లోతుగా ఆలోచించిందంటే, అసలు రాముని పట్టాభిషేకము భంగము కాలేదంటుంది. రాముని కీర్తిపతాకము లోకమంతా వ్యాపించి వుంది. రామచంద్రుడే నిజమైన ప్రభువు. ఆయన కీర్తి యుగయుగాలుగా, జగమంతా ప్రసిద్ధి చెందుతుందని ఆమె భావన. సత్య ధర్మాలనే ధనంతో రాముడు ధనహీనుడు కాదని చెబుతోంది. పైగా సుమిత్ర అంటుంది..

**పృథివ్యా సహవై దేహ్యాశ్రియాచ పురుషర్షభః**

**క్షిప్రంతి సృభిరేతాబ్ధిః సహరామోభితక్ష్యతే ॥**

అంటే పురుషోత్తముడైన రామునకు భూమి (పృథివ్యా వైదిహి) శ్రియా, లక్ష్మి అను ముగ్గురితో కలిసి రాజ్యాభిషేకం జరుగుతుంది. ఇక్కడ శ్రీరాముడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అని ధ్వనించేలా

ప్రసంగించింది. శ్రీదేవి, భూదేవితో శోభించే నారాయణుడు సీతతో కలసి, అయోధ్యలో కొలువై వుంటాడని దాని భావము. అక్కా! రాముడు తప్పక ఇనుమడించిన కీర్తితో తిరిగి వస్తాడని వూరడిస్తుంది. ఇంకా వాల్మీకి మహర్షి సుమిత్రకెలాంటి యోగ్యతా పత్రమును ఇచ్చాడంటే **'వాక్యోపచారే కుశలా నవాద్యా'** అంటే మాటల ద్వారా ఉపచారము చేయుటలో కౌసల్యముగల సుమిత్ర దోషరహితమైనది. (అనవద్యా) సుమిత్ర మాటలను ఆలకించిన కౌసల్య గుండె బరువు తగ్గింది. మైత్రికి ప్రతిరూపమే సుమిత్ర.

రామాయణంలో విశిష్ఠ పాత్రలుగా మనకు తెలిసిన వారిలో సుమిత్ర ఒకరు. స్త్రీపాత్రలలో ఇంత ఉదాత్తమైన అమోఘమైన పాత్రను మనం అరుదుగా చూస్తాము. ధర్మ ప్రవర్తనకు, ధర్మ జీవనమునకు అలవాటుపడిన సుమిత్ర ఒక గృహిణిగా, రాణిగా చూస్తే ఆ పాత్రకు అన్యాయం చేసినట్లే. లక్ష్మణుని వంటి త్యాగధనుని ప్రపంచానికి ప్రసాదించిన త్యాగమయి సుమిత్ర. ఆమె విశ్వానికి మిత్రవాణి. సుమిత్ర గురించి ముచ్చటగా మూడు మాటల్లో చెప్పాలంటే ఆమె స్మితభాషిణి, హితభాషిణి, మితభాషిణి.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

జనవరి 2020

6 సోమ - ముక్కోటి ఏకాదశి. శ్రీసద్గురుపాదపూజ

10 శుక్ర - పుష్య పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

14 మంగళ - భోగి - శ్రీసద్గురుపాదపూజ రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

15 బుధ - సంక్రాంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

19 ఆది - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

ఫిబ్రవరి 2020

5 బుధ - భీష్మ ఏకాదశి - శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా వార్షికోత్సవం. శ్రీసద్గురు పాదపూజ.

5-2-2020 నుండి 9-2-2020 వరకు పూజ్యశ్రీ మాతాజీ వారి సత్సంగ సమావేశములు.

9 ఆది - మాఘపూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

18 మంగళ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

21 శుక్ర - మహాశివరాత్రి - శ్రీసద్గురుపాదపూజ

# సత్సంగామృతం - 3

- మురళీ

**శ్రీబాబూజీ మహరాజ్ వారి దివ్యబోధామృతం (12-5-1980)**

"రామనామ మహత్త్యం ఇంత అని వర్ణింప శక్యం కాదు. శాస్త్రములు ఎన్ని చదివినప్పటికీ, వాటిని విపులీకరించి ఉపన్యాసాలు ఇచ్చే శక్తిని సంపాదించి నప్పటికీ అది అనుభవంతో సాటిరాదు. మైసూరు మహారాజా భవనం లోనికి వెళ్ళి అందలి చిత్ర విచిత్ర వస్తువులను స్వయముగా తిలకించి ఆనందించిన వారికి, అవే విషయాలను పుస్తకములలో చదివి తెలుసుకున్న వారికి ఎంత వ్యత్యాసముందో సత్య పదార్థాన్ని అనుభవ పూర్వకముగా తెలుసుకున్న వారికి, ఆ విషయాలను శాస్త్రాలలో చదివి తెలుసుకొన్న వారికి అంత వ్యత్యాసము వుంటుంది. స్వయముగా చూసిన వారికంటే ఆ విషయాలను పుస్తకములలో చదివిన వారు గొప్పగా ఉపదేశించ వచ్చును గాక! ఆ పట్టణానికి తాను స్వయముగ వెళ్ళినప్పుడు అక్కడి చిత్ర విచిత్రముల గురించి ఇతరులను అడిగి తెలుసుకొన వలసినదేగాని తనంతట తాను తెలుసుకొనలేడు. అక్కడి చిత్రములను ఇంతకు ముందే చూచినవారి పరిస్థితి వేరు. వారు ఇతరులను అడగకుండానే వారిని ఆకర్షించిన వస్తువులను చకచకా వెళ్ళి చూచుటయే కాక, ఇతరులకు కూడా వాటిని చూపించగలరు. అనుభవం సంపాదించిన వ్యక్తి యొక్క లక్షణము ఇలా ఉంటుంది. శాస్త్రం చదువుకొన్న వారు అనేక గ్రంథాలను చదివి లైబ్రరీ విద్యను పెంపొందించుకొంటారు. దానితో పాటు వారి సంశయాలుకూడా పెరుగుతాయే కాని తరగవు. యదార్థమైన అనుభవ జ్ఞానం మాత్రమే వారి సంశయాలను ఛేదింప గలదు. అనుభవ జ్ఞానం లేని శ్రమ నిష్ఫలం. ఎన్ని గ్రంథములు చదివినప్పటికి సంశయ నివృత్తి కాదు. జీవితం అంధకార బంధురముగా, అగమ్య గోచరముగా ఉంటుంది.

సగుణ తత్వం, నిర్గుణ తత్వం. ఈరెండిటిలో ఏది గొప్పది? సగుణ తత్వం సులభముగా అర్థం అవుతున్నట్లు, నిర్గుణ తత్వం అర్థం కానట్లు పైకి అనిపిస్తుంది. గురువుపై భక్తి, విశ్వాసాలను పెంపొందించుకొని, గురు తత్త్వాన్ని జీర్ణింప చేసుకొన్నవారికి సగుణోపాసనలోను, నిర్గుణోపాసనలోను భేదం కనిపించదు. సగుణోపాసనలోని ఫలం మన

కనులకు కనిపించేది. కనులకు కనిపించే దానిని నమ్మలేకపోతే, కనుపించని  నిర్గుణోపాసనలోని విషయం నమ్మటం ఎట్లా సాధ్యం? గురుతత్త్వాన్ని గ్రహించ గలిగి రామనామామృత పానంలోని విశేష మాధుర్యాన్ని అనుభవించ గలిగిన వారికి ఇటువంటి సంశయాలు వుండవు.

శ్రీరాముడు తులసీదళదాముడు. తులసీదేవి మహా పతివ్రత, ఆమె భర్త రాక్షసుడైన జలంధరుడు. అయినా తన పాతివ్రత్య మహిమ వలన దైవ శక్తిని కూడ అతిక్రమించి దైవాన్ని కూడ బంధించగలిగింది. తులసీదాసు రచించిన 'రామ చరితమానస' గ్రంధమును కూడ శ్రీరాముడు ధరించే పవిత్ర తులసీ దళంగా చెప్పవచ్చు. రామనామ జప మహిమచే  తులసీదాసు మనస్సులోని మాలిన్యం హరింపబడినది. రామనామం అతని మానవ సహజమైన కామాన్ని, జ్ఞానకామంగా మార్చింది. అతని అంతఃకరణ చతుష్టయం మనో బుద్ధి చిత్తాహంకారాలు సత్యం, శాంతి, దయ, ప్రేమగా మారాయి. అజ్ఞాన రూపమయిన అహంకారం నశించింది.

జీవితంలో ఆశ బంధాన్ని కలిగిస్తుంది. ఆశను పాశముగా వర్ణించి చెపుతారు. ఆశకు మితి లేదు. ఎంత సంపాదించినప్పటికి ఇంకా సంపాదించవలెననే అనిపిస్తుంది. ఈవిధముగా ధనమునకు, కీర్తి ప్రతిష్టలకు పెనుగులాడుట వలన చిత్తములో అశాంతి కలుగుతుంది. అశాంతి పోయి శాంతి ఏర్పడితే కాని జీనితంలో సుఖం  కలగదు. గురువుపై భక్తి విశ్వాసాలు పెంపొందించుకొన్న వారికి మాత్రమే అట్టి చిత్త శాంతి కలుగుతుంది. తాను స్వయంగా శాంతి సంపాదించలేని వారు, ఉపన్యాసముల ద్వారా అట్టి శాంతిని ఇతరులకు ఎలా ప్రసాదించ గలరు? చిత్త శాంతిని పొందిన మహనీయుని ముఖము ఎల్లప్పుడూ చిరునవ్వుతోనూ, నూతనోత్తేజముతోను ప్రకాశిస్తుంది.

సద్గురు దేవులు అమెరికా వెళ్ళినప్పుడు అచ్చటి ఒక ధనికుడు ఆశ్రమానికి విలువైన మొత్తాన్ని ధనరూపంగా  విరాళం ఇవ్వజూపాడు. భారత దేశం నుండి వచ్చిన సన్యాసులకు ధనరూపంగా ఎంతో కొంత విరాళం ఇవ్వటం అతనికి రివాజు. అతడిచ్చే ధనం కంటే అతనిలో మానసిక పరివర్తన కలుగుటయే తనకు ముఖ్యమని భావించిన శ్రీ

బాబూజీ “ఆ ధనాన్ని మీరు ఎవరికైనా ఇవ్వండి. మాకు ధనంతో అవసరం లేదు. మీ మనస్సు పవిత్రమైన అంతఃకరణతో, చిత్త శుద్ధితో భగవంతునిపై ఏకాగ్రముగా నిలిచినప్పుడు దాని విలువ అనే ధనం మాకు పోస్టు ఖర్చు లేకుండా చేరుతుంది. మాకు కావలసిందదే” అని శ్రీ బాబూజీ అతనికి నచ్చజెప్పారు.

అతడు ఆశ్చర్యపోయి, శ్రీ బాబూజీ వెంట వచ్చిన వారిని ‘మీరైనా ఈ ధనాన్ని ఆశ్రమానికి తీసుకువెళ్ళండి’ అని బ్రతిమాలాడు. వారంతా సవినయంగా తిరస్కరించారు. “చొక్కా కాలరు క్రింద ఒక పెద్దకాళ్ళ జెర్రి ఉంటే ఎంత సుఖంగా ఉంటుందో ఆ ధనాన్ని స్వీకరిస్తే అంత సుఖంగా ఉంటుంది” అని భక్తులతో స్వామి సెలవిచ్చారు.

అదే సందర్భములో “మనం నమ్ముకొన్న శ్రీరామ పాదుకలలోని చిటికిన వ్రేలి ప్రకాశం ఈ సమస్త లోకాల్ని పాలింప గలదు. మనకు కొదవేమిటి? జగజ్జనని కటాక్షం పరిపూర్ణంగా మనకు లభిస్తుండగా, లోటు ఏర్పడినప్పుడు కదా! ఇతరుల ధనం కోరవలసిన పరస్థితి ఏర్పడేది? అట్టి కొరత నా జగజ్జనని నాకు ఎన్నటికీ కలిగించదు.” అన్నారు శ్రీ బాబు.

**సమర్థ సద్గురు మాసపత్రిక పాత ప్రతులను ఆన్‌లైన్‌లో చదవడానికి మీ స్మార్ట్‌ఫోన్‌తో ఈ ప్రక్కన ఇవ్వబడిన QR CODE స్కాన్ చేయండి.**

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూాలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించు కొనవలసినదిగా విజ్ఞప్తి.

# గురు కృప

- జి. శ్రీనివాస మూర్తి

పీర్‌బాబా నగరానికి దూరంగా ఒక చిన్న ఆశ్రమం నిర్మించుకుని అందులో నివసించేవారు. ప్రతిరోజు సాయంకాలం ఆయన ప్రసంగాలు వినడానికి నగరం నుండి గురుప్రసాద్ అనే భక్తుడు వచ్చేవాడు. అతను తన అనుభవాలను తన ప్రాణస్నేహితుడైన మూర్తితో పంచుకుంటూ వుండేవాడు. కానీ ఆ స్నేహితుడు మాత్రం బాబాలను ఏమాత్రం నమ్మక, పైగా ఆ స్నేహితుడిని కూడా విమర్శిస్తూ వుండేవాడు. అలా కొంతకాలం గడిచాక ఒకరోజు మూర్తి ప్రసాద్‌తో నాకు కూడా ఆ బాబాను చూడాలని వున్నది, నీతో తీసుకెళ్ళమని అడిగాడు. ఆ మరునాడు సాయంత్రం స్నేహితులు ఇద్దరూ ఆశ్రమానికి చేరుకున్నారు. చీకటిపడుతూనే బాబా తమ ప్రసంగాన్ని ప్రారంభించారు.

కానీ ఆ ప్రసంగం జరుగుతున్నంత సేపూ మూర్తి అసహనంగా తనను తాను నిందించుకుంటూ, 'అనవసరంగా ఇక్కడికి వచ్చి నా సమయం అంతా వృథా చేసుకుంటున్నాను. అదే నా స్నేహితులతో వెళ్ళి నట్లయితే ఈ సాయంత్రం అంతా చక్కగా పార్టీలో గడిచేది' అని మనసులో వాపోతూనే వున్నాడు.

బాబా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 'భగవంతుడిని మీరు ఎప్పుడూ మీ కంటే ఉన్నతమైనవాడిగానే భావించాలి. తప్పని పరిస్థితులలో మాత్రమే మీతో సమానమైనవాడిగా చూడాలి. కానీ ఎట్టి పరిస్థితులలో కూడా ఆఖరికి కలలో కూడా భగవంతుడిని మీకంటే తక్కువ వాడిగా భావించరాదు' అని బోధించారు.

అది విన్న మూర్తి 'ఈయన ప్రసంగం ఎంత అర్థ రహితంగా వుంది! ఎవరైనా భగవంతుడిని తన కంటే తక్కువవాడిగా ఎలా చూస్తారు? ఈయన అందరి కాలాన్నీ కూడా వృథా చేస్తున్నాడు' అనుకున్నాడు తన మనస్సులో.

ప్రసంగం పూర్తి అయిన తరువాత బాబా ఆరోజు వాతావరణం బాగోలేదని, కాబట్టి ఆ రాత్రికి భక్తులందరినీ ఆశ్రమంలోనే విశ్రాంతి తీసుకుని, మరునాడు ఉదయమే తిరిగి వెళ్ళమని అభ్యర్థించారు. మూర్తి ఆ ఆశ్రమంలో తనకు కేటాయించిన కుటీరంలో విశ్రాంతి తీసుకున్నాడు.

మరునాడు ఉదయమే ఎవరో మూర్తి వున్న కుటీరం తలుపు తట్టారు. తలుపు తీసిన మూర్తికి రెండు పళ్ళాలలో అల్పాహారంతో ఒక వ్యక్తి కనిపించాడు. ఒక పళ్ళెంలో చాలా ఎక్కువ మొత్తంలో వెన్న వేసిన పరోటాలు, నంచుకోవడానికి ఒకగిన్నెలో రుచికరమైన పప్పు, ఉల్లిపాయ ముక్కలు వున్నాయి. మరొక పళ్ళెంలో ఎండిపోయిన రొట్టెలు, చూడటానికి సామాన్యంగా వున్న పప్పు వున్నాయి. ఆ రెండు పళ్ళాలు తీసుకుని మూర్తి ఇక తినడానికి ఉపక్రమిస్తున్నాడు. అంతలోనే మళ్ళీ ఎవరో తలుపు తట్టారు. ఈసారి తలుపు తీస్తే ఎదురుగా ఒక బిచ్చగాడు నిలబడి వున్నాడు.

'అయ్యా! అన్నం తిని మూడు రోజులు అయింది. ఇన్నాళ్ళుగా ఆకలితో నడుస్తూనే వున్నాను. అలసిపోయాను. దయచేసి ఆ భగవంతుని పేరు చెప్పుకుని నాకు తినడానికి ఏదైనా పెట్టండి' అని అర్థించాడు. అప్పుడు మూర్తి అతనికి తన తగ్గర వున్న ఎండిపోయిన రొట్టెలు, పప్పు గల రెండవ పళ్ళాన్ని అతనికి ఇచ్చాడు. ఇక తాను త్వరగా తన అల్పాహారాన్ని ముగించి, తన స్నేహితుడితో కలసి ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

కానీ, ఆశ్రమ ఆచారం ప్రకారం ముందుగా బాబా వద్ద సెలవు తీసుకుని వెళ్ళవలసి వుంటుంది. అలాగే వారిద్దరూ బాబా వద్దకు వెళ్ళారు. బాబా మూర్తిని ఆప్యాయంగా పలకరించి, 'ఇక్కడ మీకు బస సౌకర్యంగా వున్నదని భావిస్తాను. ఏమైనా లోపాలు వుంటే నిస్సంకోచంగా తెలియ జేయండి. భవిష్యత్తులో మా అతిథులకు మరింత సౌకర్యంగా వుండేలాగా చేయడానికి మీ సలహాలు తప్పక వుపయోగ పడతాయి' అన్నారు.

అప్పటికే చాలా అసహనంగా వున్న మూర్తి ఎటువంటి సలహా సంప్రదింపులు సూచనలు చేయలేదు. కానీ బాబా అంతటితో వదలక, మూర్తిని అల్పాహారం తీసుకున్నారా? ఉదయం ఏమైన జరిగిందా? అని మళ్ళీ తిరిగి ప్రశ్నించారు. అప్పుడు మూర్తి ఆ బిచ్చగాడి ఉదంతాన్ని వివరించాడు.

అప్పుడు బాబా 'నిన్న రాత్రి నేను ప్రవచనంలో ఏం చెప్పానో గుర్తుందా?' అని అడిగారు. రాత్రి బాబా చెప్పినమాటలే తిరిగి మూర్తి చెప్పాడు. అప్పుడు బాబా 'మరి ఆ బిచ్చగాడు భగవంతుని పేరు చెప్పుకుని ఏదైనా ఇమ్మనమని అడిగాడు కదా! నీవు అతనిని భగవంతునిగానో

లేక ఆయన బిడ్డగానో భావించి వుంటే ఏమి ఇచ్చేవాడివి? నీకున్న దానిలో మంచి ఆహారాన్ని అంటే పరాతాలు వెన్న వున్న మొదటి పళ్ళాన్ని ఇచ్చేవాడివి. కనీసం అతనిని నీతో సమానంగా భావించినా వున్న ఆహారం మొత్తాన్ని చెరిసగం పంచి ఇచ్చేవాడివి. కానీ నువ్వు నీకు పనికిరాని, ఇష్టం లేని ఎలాగైనా పడవేయదలచుకున్న ఎండిపోయిన రొట్టెల పళ్ళాన్ని అతనికి ఇచ్చావు. ఇప్పుడు నువ్వు భగవంతుడిని ఏ స్థాయిలో భావించినట్లు?' అని ప్రశ్నించారు.

ఒక్కసారిగా తన అజ్ఞానానికి పశ్చాత్తాపంతో మూర్తి కళ్ళు చెమర్చాయి. అతనిలో జ్ఞానోదయం అయింది. అతను వెంటనే బాబా పాదాలపై సాష్టాంగపడి తన అజ్ఞానానికి తనను క్షమించి, తనను శిష్యునిగా స్వీకరించమని వేడుకున్నాడు.

మూర్తి పూర్వ జన్మ సంస్కారాలన్నీ గురుకృపతో ఒక్కసారిగా మేల్కొని, ఈ జన్మలో తనకు దక్కవలసిన జ్ఞానరత్నం లభించింది. ఏ మనిషికైనా ఒకానొక సందర్భంలో ఇలాగే గురుసంసర్గం కలుగుతుంది. అయితే దానికి కారణం మాత్రం కేవలం నిర్హేతుకమైన గురుకృపయే !!

## పాఠకులకు
## నూతన సంవత్సర
## మరియు సంక్రాంతి
## శుభాకాంక్షలు



# గీతా సారం

- రమణ ప్రసాద్

ఉపనిషత్తులను గోవులుగాచేసి ఎవరు పిండారు? శ్రీకృష్ణుడు. ఎవరు పొందగలుగుతున్నారు? ఎవరైతే ఆధ్యాత్మస్థితికి ఎదిగారో వారు పొందగలుగుతున్నారు. అర్జునుని నిమిత్తమాత్రునిగా చేసి గీతోపదేశం చేశాడు భగవానుడు.

కురుక్షేత్ర రణ రంగంలో సమకూడిన బంధుజనులను చూసి మోహం కమ్మి, 'న కాంక్షే విజయం కృష్ణ, న చ రాజ్యం సుఖానిచ..' (1. విషాద యోగం) అని శోక సముద్రంలో మునిగిన అర్జునునికి సాంఖ్య యోగాన్ని(2వ అ) జగద్గురువైన శ్రీకృష్ణుడు చెబుతున్నాడు: సాంఖ్యం అంటే జ్ఞానం. 'అర్జునా! అసత్యములు, నశించు స్వభావము గల దేహాదులకు ఉనికి లేదు, సత్యమైన ఆత్మకు నశింపు లేదు. సుఖ దుఃఖములు వచ్చేవి, పోయేవి. ఈ జగత్తు పరమాత్మచే వ్యాపింపబడి నాశరహితమై ఉన్నది. ఆత్మ నిత్యము, సత్యము, నాశరహితము" అని సంపూర్ణ జ్ఞానాన్ని బోధించాడు శ్రీకృష్ణుడు.

అంత చెప్పినా గ్రహించలేని అర్జునునికి విడి విడిగా చెబుతూ, "కర్మ చెయ్యి. నువ్వు చేసే కర్మ నిష్కామ కర్మ అయి ఉండాలి. (3.కర్మ.యోగం) కర్మ వదిలి పెట్టటానికి వీలు లేదు. నేను చేస్తున్నాను" అనే భావంతో చేస్తే అది నిన్ను అంటుతుంది. కాని 'నహి కశ్చిత్ క్షణమపి..' క్షణకాలమైనా కర్మ చేయకుండా ఉండలేవు. "జ్ఞానం బయటనుంచి వచ్చేది కాదు. అది నీ స్వరూపమై ఉన్నది" అని జ్ఞానయోగాన్ని (4వ. అధ్యాయం) చెప్పాడు పరమాత్మ. ఐదవది కర్మ సన్యాస యోగం - 'కర్మను ఆచరించు. కాని జ్ఞానానికి అది ప్రతి బంధనం కాదు.' నిష్కామంగా చేసే కర్మ ఫలం నీకు అంటదు. "నేను ధ్యానం చేస్తున్నాను" అనే భావన తొలిగితే ఆనందం లభిస్తుంది.

కర్మ సన్యాస యోగం తరువాత ఆత్మసంయమ యోగం (6వ అధ్యాయం)లో మనస్సును ఎలా నిగ్రహించుకోవాలో చెప్పబడింది. శక్తి వంతమైన బాంబు ఆకాశంలో వదిలితే అది క్రింద పడి విఫలమవుతుంది. అలాగే నిన్ను ప్రతిబంధకం చేసే అనేక ఆలోచనల సముదాయం 'నీలో' లీనమయినప్పుడు ప్రతిబంధకం తొలగి నీ మనస్సు నిశ్చలమయి, అమనస్క స్థితిని పొందుతుంది. ప్రతిదానిలో నిజతత్త్వాన్ని గుర్తించి మనస్సును అంతర్గతం చేస్తే తనను తాను గుర్తించే శక్తి కలుగుతుంది. తరువాత 7వదైన విజ్ఞాన యోగంలో ఇంకా విపులంగా చెబుతూ, 'దైవీహ్యేషా గుణమయీ। మమమాయా దురత్యయా।' - "ఈ మాయను నేనే సృష్టించాను.

త్రిగుణాత్మకమైన నా మాయను  దాటటం కష్టం. కాని నన్ను శరణు పొందినవారు ఈ మాయను దాటగలరు.” నిద్రలో నీకు కల వస్తుంది. మేలుకొన్న తరువాత, “నేను కల గన్నాను” అంటావు. అక్కడ దర్శించేదీ నువ్వే, దర్శింపబడేదీ నువ్వే. అక్కడ రెండు లేవు.

అక్షర పరబ్రహ్మ యోగం(8వ.అ)లో క్షరం నశించేది. అక్షరం నాశరహితమయినది. ‘ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మామనుస్మరన్ ।’ మనకి బాల్యం, కౌమారం, యౌవనం, వృద్ధాప్యం అనే నాలుగవస్థలు దేహానికే. కనుక అది క్షరం. లోపలఉన్నవాడికి ‘క్షరం’ ఉందా? ఇది తెలుసుకొని ఎవరైతే “ఓం” అనే ప్రణవాన్ని ఉచ్చరిస్తూ, శరీరాన్ని వదులుతాడో అతడు మోక్షాన్ని పొందుతున్నాడు.

తరువాతది- రాజ గుహ్యం(9వ.అ.). అంటే ఈ బ్రహ్మ విద్య చాలా “సీక్రెట్” నిగూఢమయినది అని అర్థం. “దానిని ‘అనసూయవే’ అసూయ లేనివాడగు నీకు చెప్పుచున్నాను. సాక్షి మాత్రుడనైన నా చేత ప్రకృతి ఈ చరాచర జగత్తును సృజించుచున్నది, ప్రవర్తింపజేయుచున్నది, లయము చేయుచున్నది. నన్ను ఆశ్రయించినవాడు శాశ్వతమైన శాంతిని పొందుచున్నాడు.  నా యందే చిత్తమును నిలిపి, నన్నే పరమగతిగా నమ్మి కొలచినచో నన్నే పొందగలవు” అని ప్రభోదం చేస్తున్నాడు భగవానుడు.

కర్మ ఎలా చేస్తే దాని ఫలం అంటదో అది మానవుడు వివేకంతో చేస్తాడు. మరి పశువుల, పక్షుల మాట ఏమిటి? అవి చైతన్యవంతములే కదా!. గరుత్మంతుడు, కల్ప వృక్షము భగవంతుని అంశలే. ‘విభూతి యోగం(10.అ)లో “సృష్టిలో శ్రేష్ఠమైనవన్నీ నా అంశములే. గడ్డి తిని పాలు ఇచ్చే గోవులను, తియ్యని ఫలాలను, చల్లని నీడను ఇచ్చే వృక్షాలను మానవుడు తన స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నాడు. చెట్టులో పుట్టలో ఉన్నది నేనే.” అణోరణీయాన్ మహతో మహీయాన్ - భగవంతుడు లేని అణువు లేదు.

ఈ ఉపదేశాన్ని విన్న అర్జునుడు, “ఓ పురుషోత్తమా!  మీ యొక్క విశ్వ రూపాన్ని నేను చూడగోరుచున్నాను” అని అర్థిస్తాడు. భగవానుడు దివ్యమైన విశ్వరూపాన్ని చూపి, “ఎవడు నా కొరకే కర్మలు చేసి, నన్నే పరమ ప్రాప్యముగ నమ్మి, నా యందే భక్తిని కలిగి ఉంటాడో, వాడు నన్నే పొందుచున్నాడు” అంటాడు.

భక్తి యోగం (12 వఅ).- శ్రేయోహిజ్ఞాన మభ్యాసాత్....త్యాగాచ్ఛాన్తి రనన్తరమ్ । జ్ఞానం కంటె ధ్యానం గొప్పది., ధ్యానం కంటె కర్మ ఫలత్యాగం గొప్పది. ‘నేను’ చేస్తున్నాను (దేహపరమైన నేను కాదు) అనే భావన గొప్పది.

“సర్వ భూత హితేరతాః - సర్వ భూతములయందు సమ దృష్టి కలిగి వుండాలి. అతడు నాకు అత్యంత ప్రియుడు” అని అంటాడు.

13వ అధ్యాయమైన క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో, ఈ శరీరమే క్షేత్రము, పరమాత్మ క్షేత్రజ్ఞుడు. “నీవు చూచునదెల్ల నీవయే అనుచు” - అని ఇది - తత్త్వమసి మహావాక్యానికి అర్ధం - “అదే నీవు అయి ఉన్నావు” అని గురుబోధ చేత తెలుసుకుంటావు.

గుణ త్రయ విభాగ యోగం(14వ అ)లో సత్వ రజ తమో గుణాలు ఈర్ష్యాద్వేషాల వల్ల వృద్ధి పొందుతాయి. - వాటికి కారణాలు గుర్తించాలి. స్వామి వివేకానంద వాటిని తొలగించుకోమనలేదు. దైవీపరంగా వాటిని మలచుకొమ్మన్నాడు. పురుషోత్తమ ప్రాప్తి యోగం (15వ అ)- విశ్వరూప సందర్శనయోగం సగుణమైతే, ఈ యోగం నిర్గుణం. ఈ సంసారం యొక్క కొమ్మలు, సత్వ రజస్తమో గుణములచే వృద్ధి పొందబడి, శబ్దాది విషయములను చిగుళ్ళు కలదై, స్థావరము నుండి బ్రహ్మలోకము వరకు వ్యాపించి ఉన్నవి. ఎవడు మూడు లోకములయందు ప్రవేశించి దానిని భరించుచున్నాడో అట్టి నాశ రహితుడు, జగన్నియామకుడే పురుషోత్తముడు. దానిని తెలుసుకోవటమే పురుషోత్తమ పాప్తి. దైవాసుర సంపద్విభాగయోగం (16వ అ)లో దైవీ గుణాలు , అసుర గుణాలు మనలో ఎలా ఉన్నదీ గమనించి నువ్వు వాటిని సాక్షిగా చూడాలి. అప్పుడు రాగ ద్వేషాలు ఎక్కడ వస్తాయి? ద్వైతం రహితమవుతుంది.

శ్రద్ధాత్రయ విభాగ యోగం(17వ అ) - గీతా జయంతిని ఈ నాడు జరుపుకుంటూ గీతా పారాయణ చేశాం, దానిని మననం చేసి దానిని అనుభవిస్తున్నాం. అదే శ్రద్ధాత్రయం అంటే. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః। -“శాస్త్ర వాక్యములందును, గురువాక్యములందును శ్రద్ధ కలవాడు, ఇంద్రియములను జయించినవాడు, జ్ఞానమును, పరమ శాంతిని అతి శీఘ్రముగ పొందుచున్నాడు” అని అర్థం. మోక్ష సన్యాస యోగం(18వ అ) సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ। అహం త్వా సర్వపాపేభ్యో, మోక్షయిష్యామి మా శుచః ॥ “ఓ అర్జునా! సమస్త ధర్మాలను విడిచిపెట్టి నన్నే శరణు పొందు. నేను నిన్ను సర్వ పాపాలనుండి విముక్తుని చేస్తాను” అంటున్నాడు భగవానుడు. యోగివయ్యే ఉన్నావు అనే విషయం భగవద్గీత మనకి గుర్తింపచేస్తోంది. అట్టి భక్తి జ్ఞాన వైరాగ్యాలను మనందరికీ శ్రీ గురుదేవులు ప్రసాదించుగాక! సుఖీభవ!

# తెలివిగలవారే ఉన్నత పదవులకు అర్హులు

- గాలి జగదీశ్

ఒక రాజ్యంలో రాజుగారు ఒకసారి తన ఆస్థానంలో పనిచేసేవారి అభిప్రాయాలు తెలుసుకొనగోరి, మంత్రిని తగిన ఏర్పాట్లు చేయమన్నాడు. తేలినదేమిటంటే ఆస్థానంలోని మిగతా పనివారంతా 'మంత్రిగారు అసలు ఏమీ పనిచెయ్యడు. మూర్ఖుడిలాగా ప్రవర్తిస్తూ వుంటాడు. మనం అందరం రాత్రింబవళ్ళు ఎంతో కష్టపడి పనిచేస్తాము. కానీ రాజుగారికి ఆ మంత్రిగారంటేనే ఎక్కువ ఇష్టము. గౌరవము. ఆయనకు మన అందరికంటె ఎక్కువ జీతం ఇస్తాడు' అని వారి మనసులో అభిప్రాయం.

విషయం తెలుసుకున్న రాజుగారు తగిన సమయం చూసి వారికి అర్థమయ్యేలాగా చేయాలనుకున్నాడు. ఒక రోజు ఒక పెద్ద ఏనుగును తెప్పించి, పనివారందరినీ పిలిపించి, బజారులోకి తీసుకు వెళ్ళి ఈ ఏనుగు బరువు ఎంత ఉందో తెలుసుకుని రమ్మనమని పంపిస్తాడు. వాళ్ళు ఆ రోజంతా కాళ్ళు అరిగేటట్లుగా రాజ్యమంతా తిరిగి, ఆ ఏనుగును తీసుకుని రాజసభలోకి వస్తారు. 'వెళ్ళినపని ఏమైంది? ఆ ఏనుగు ఎంత బరువు ఉన్నది?' అని రాజువారిని ప్రశ్నిస్తాడు. దానికి వారు సమాధానం చెబుతూ, 'మహారాజా! మన రాజ్యంలో ఎక్కడా కూడా ఈ ఏనుగు బరువును తూయగలిగినంత పెద్ద త్రాసుకాని, ఇతర పరికరము కానీ ఎక్కడా లేదు. అందువలన మేము దాని బరువును తెలిసికొన లేకపోయాము' అని చెబుతారు.

అప్పుడు రాజుగారు మంత్రిని పిలిచి, ఆ ఏనుగు బరువు ఎంతో తెలుసుకుని రమ్మనమని చెబుతాడు. కొంత సమయం తరువాత తిరిగి వచ్చిన మంత్రి 'ఆ ఏనుగు బరువు 1100 కే.జీలు' అని చెబుతాడు. దానికి ఆ పనివారు ఎంతో ఆశ్చర్యంతో 'అంత పెద్ద త్రాసు మీకు దొరికిందా?' అని అడిగారు. దానికి ఆ మంత్రి 'ఈ ఏనుగును ఒక స్టీమరులోకి ఎక్కించాను. మొదటి గుర్తును, ఏనుగు ఎక్కిన తరువాత గుర్తును తెలుసుకుని, దాని బరువును తెలుసుకున్నాను' అని సమాధానం చెప్పాడు. అప్పుడు రాజుగారు పనివారితో 'చూశారా! మీకు, ఆయనకు ఉన్న భేదము! తెలివిగల వాడే ఉన్నత పదవికి అర్హుడు. అది తెలియక మీరు మూర్ఖులవలె మాట్లాడారు' అన్నాడు.


దేవునితో బేరం
మధుప
దేవుడా! దయచేసి నాకు ఈ పరీక్షల్లో సహాయం చెయ్యి. ఎలాగైనా నన్ను పాస్ చేయిస్తే నీకు చెక్కెరపొంగలి చేయిస్తాను.
1
హమ్మయ్య! దేవుని దయవల్ల పరీక్ష బాగా వ్రాసాను. ఇక ఆయనకు చెక్కెరపొంగలి చేయించాలి.
2


చెక్కెరపొంగలిలో బాగా నెయ్యి వేసి, పాలలో ఉడికించి, జీడిపప్పులు, కొబ్బరిముక్కలు, యాలకులు వేస్తే ఎంత బాగుంటుందో!
3
అయినా నా పిచ్చిగానీ దేవుడు ఆ ప్రసాదం తింటాడా? పెడతాడా?
4


ఖర్చు ఎక్కువ -
జీడిపప్పులు
తీసేద్దాం!
5
ఆయన తినని దానికి
పాలు, నెయ్యి,
యాలకులు కూడా
అనవసరమే. ఏదో
మాటవరసకు నీళ్లతో
ఉడికించి పెట్టేస్తే
సరిపోతుంది.
6


రాముూ! టైము అయిపోయింది. పేపర్ ఇచ్చేయ్.
7
అయ్యయ్యో! నేను ఆన్సర్ పేపర్ బదులు క్వశ్చన్ పేపర్ ఇచ్చేసి వచ్చానే! మన అవసరం కోసం మ్రొక్కుకొని తీరా అవసరం తీరిపోయాక దేవునితో బేరాలాడితే ఇలాగే ఉంటుంది.
8

# శ్రీ కృష్ణం వందే జగద్గురుమ్

(గత సంచిక తరువాయి)

- సుషుమ్నా ప్రసాద

**సర్వోపనిషదోగావో దోగ్ధా గోపాల నందనః ।**
**పార్థో వత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతమ్ మహత్॥**

సాక్షాత్ భగవానునిచే ప్రబోధింప బడినది కాబట్టి అది భగవద్గీత అయింది. గీతా ప్రబోధాన్ని శ్రవణం చేసి, మననం చేసుకుని, గీతాసారము ఆచరణలో పెట్టగలిగన ప్రతి జీవి ధన్యజీవియే! భగవద్గీత శ్రీకృష్ణ పరమాత్మ మానవాళికి ప్రసాదించిన ఒక మహత్తర కానుక. ఆ అపూర్వ మణిమయ 'గీత' ఒక జాతికి, ఒక దేశానికి, ఒక తరానికి, ఒక మతానికి, ఒక కాలానికి పరిమితమైనది కాదు. భగవద్గీత మత గ్రంథం కాదు. సర్వ మానవాళికి మానవతా ధర్మమును ప్రబోధించి, తరింపజేసే నిరుపమానమైన, మహోత్కృష్టమైన గ్రంథరాజము. మానవతా విలువలన్నీ పొందుపరచిన అమూల్యమైన మణిమాల. శ్రీకృష్ణస్వామి కృష్ణపక్షములో అర్ధరాత్రి అవతరించారు. కృష్ణపక్షము అర్ధరాత్రి అంధకారమునకు సంకేతము. అంటే అజ్ఞానాంధకారమును తొలగించి, జ్ఞానజ్యోతిని ప్రకాశింపజేశాడు. జ్ఞానజ్యోతి అంటే 'కృష్ణ జ్యోతి'యే. గర్గ మహర్షి ఎంతో ఆలోచించి, ఆ నందయశోదా తనయునకు 'కృష్ణ' అని నామకరణం చేశాడు. అది సార్థక నామధేయము. కృష్ణపరమాత్మ అష్టమి నాడు అవతరించాడు. అష్టమికి ఒక ప్రత్యేకత వున్నది. అష్టమి అష్టకష్టాలను తొలగించి, అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తుంది. ఎందుకంటే అది శ్రీకృష్ణజన్మాష్టమి కదా. దేవకీదేవి అష్టమ గర్భాన అవతరించాడు. భగవద్గీతకు అష్టాదశాధ్యాయములు. అష్ట ప్రకృతులను తన ఆధీనంలో వుంచుకొన్న జగద్విజేత జగన్మోహనుడైన మురళీకృష్ణుడు. అష్టలక్ష్మీ



సమేతుడైన శ్రీమన్నారాయణ మూర్తి, శ్రీకృష్ణ పరమాత్మగా అష్టలక్ష్ములను అష్టసతులుగా చేపట్టాడు. అష్టవర్షములు గోకులములో గోపాల కృష్ణునిగా నందయశోదలను, నందవ్రజములో గోపికలు, గోపాలురు, గోవులు యావన్మందిని తన ముద్దుమురిపాలతో, బాలక్రీడలతో, మహిమలతో, మాయా లీలలతో ఆనందాంబుధిలో ఓలలాడించిన మహిమాన్వితుడు మదనగోపాలుడు. మూడోనెల పసిబిడ్డగా పూతన సంహారంతో ప్రారంభించి, రాక్షసులందరిని దునుమాడి, గోపీ మానస చోరుడైనాడు. భక్తి అనే వెన్నను ఆత్మార్పణమనే మీగడను, గోపకాంతల హృదయాలనే కడవల నుండి దోచుకుని వారితో దోబూచులాడి, చిన్నారి కన్నయ్య వారి వలువలను తస్కరించి, వారికి ఆధ్యాత్మిక విలువలను పంచిపెట్టాడు.

గోకులంలో మురళీమోహనుని మహిమలలో రాసలీలా ఘట్టము మకుటాయమానమైనది. తాను ఒక్కడే గోపకాంతలతో బృంద నృత్యమాడుతూ 'నారీ నారీ నడుమ మురారి' అని ఒక్కొక్క గోపికకు ఒక్కొక్క కృష్ణునిగా మైమరిపించాడు. కానీ వున్నది అఖండమైన కృష్ణ తత్వం (ఆత్మ తత్త్వం) ఒక్కటే భిన్నభిన్నంగా గోచరించింది. అదే కృష్ణ గారడి, కృష్ణ మాయ. ప్రతి గోపికకు చిన్నారి కన్నయ్య తన ఒక్కరి సొత్తే అని భ్రమ కలిగించాడు. కృష్ణ ప్రేమ కృష్ణ విభూతిని పుష్కలంగా అనుభవించి తరించినవారు గోపికలు. గోపాలకులు బాలకృష్ణుని లీలలతో, క్రీడలతో స్వామి చెంతనే వుండి అవధులులేని ఆనందాన్ని అనుభవించిన భాగ్యశాలురు! గోవులను గోపాలకులను విధాత మాయం చేసి అహంకారముతో గోపాల దేవుని అనంత శక్తిని విస్మరించి, పరీక్షించాలి అనుకున్నాడు. చివరకు పరాభవమే మిగిలింది. విరించినే సృజించిన శ్రీమన్నారాయణునకు ప్రతి సృష్టి చేయడమొక లెక్కా? తానే గోవులు గోపాలకులుగా మారి గోపకాంతలకు దివ్యానుభూతిని పొందింపజేశాడు.

గోవులు, గోవత్సములు, గోపబాలురంతా గోవిందుని స్వరూపమే కావడంతో గోపకాంతల చిరకాల వాంఛ నెరవేరింది. యశోదమ్మతల్లిలాగ మురిపాల ముద్దుల మురళీకృష్ణుని తమ యెదలకు హత్తుకుని, స్తన్యమిచ్చి గోరుముద్దలు తినిపించి, తరించాలనే వారి ప్రగాఢ వాంఛను ఒక సంవత్సర కాలము సంపూర్ణంగా అనుభవించే సదవకాశమును

ప్రసాదించాడు. గోవర్ధనగిరిని చిటికిన వేలుతో ఎత్తి రాళ్ళ వర్షం నుండి రక్షించి దేవేంద్రునికి గర్వభంగం చేశాడు. కాళీయమర్ధనం తరువాత కంస సంహారమునకు సంసిద్ధుడయ్యాడు. నందవ్రజాన్ని ఆనంద నిలయంగా మార్చి ఏడేళ్ళ ప్రాయంలో ఏడేడు భువనాలకు ఏలికయ్యాడు. నందవ్రజవాసులందరినీ స్థితప్రజ్ఞులుగా మార్చిన జగద్గురువు జగన్మోహనుడైన బాలకృష్ణుడు, అష్టవర్షప్రాయంలో మధురానగరికి వెళ్ళి కంససంహారం చేశాడు. సప్తవర్షప్రాయంలో సకల జగత్తుపై సమ్మోహనాస్త్రం ప్రయోగించి, సాధు సంపన్నులుగా మార్చి తరింపజేసిన తాండవకృష్ణునకు అంజలిఘటించటమే మానవాళి తక్షణ కర్తవ్యము. బాలకృష్ణుని జగన్మోహనాస్త్రములో పరవశించిన గోపికల భాగ్యమే భాగ్యము! ఆ దివ్య స్మృతులతోనే వారి శేషజీవితాలు నిరాకార నిరంజనుడై, సర్వవ్యాపకుడైన కృష్ణ భగవానుని సర్వత్రా దర్శిస్తూ, నిస్సంగులై నిర్మలానంద స్వరూపుడైన నీరజాక్షునకు నీరాజనాలు అర్పించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి అష్ట ఐశ్వర్యములను ప్రసాదించి, జన్మరాహిత్యమొనర్చే మధురాతి మధురమైన పర్వదినం. జగద్గురువైన ఆ ప్రేమానంద మూర్తికి 'కృష్ణం వందే జగద్గురుమ్' అంటూ భక్త్యంజలి ఘటించటమే మనమివ్వగలిగిన జన్మదిన కానుక!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జనవరి 2020, ఫిబ్రవరి 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***జనవరి 2020*** : AS 4914, 5426, 6483, 7000, 7003, 7007, 7008, 7009, 7011, 7018, 7019, 7020, 7026, 7027, 7028, 7030, 7031, 7032, 7034, 7037, 7204, 7208, 7431, 7643, 7645, 7964, 7965, 7966, 7968, 7969, 7970,7971, 7972, 7973, 7985

***ఫిబ్రవరి 2020*** : AS 4166, 5490, 7055, 7058, 7062, 7063, 7678, 7679, 7681, 7990, 7991, 7992, 8000, 8001, 8002

# తిరుప్పావై

సేకరణ - మురళి

**రచన - శ్రీ నండూరి ఆనందమ్మ తల్లి, శ్రీ కృష్ణా శ్రమము**

శ్రీ పెరియాళ్వారుల (విష్ణుచిత్తుని) కుమార్తె అయిన శ్రీగోదాదేవి రచించిన తిరుప్పావై ప్రబంధము అనేకవేల భావార్థాలు కలది. అపారమైన గంభీరార్థములతో నిండి ఉన్నది ఈ దివ్య ప్రబంధము. వాటిలో కొన్నిటిని సంక్షిప్తంగా మీ ముందు వుంచుతున్నాము.

ద్వాపరయుగంలో బృందావనంలో వుండే సమకాలికులైన గోపికలంతా శ్రీకృష్ణ పరమాత్మయందు అపరిమితమైన ప్రేమకలవారై, ఆ పరమాత్మను పొందుటకు యమునా నదీ తీరాన కాత్యాయనీ వ్రతం చేసి, శ్రీకృష్ణపరమాత్మయందు ఐక్య భావన పొంది బ్రహ్మానందాన్ని అనుభవించినట్లే, మన గోదాదేవి తాను అవతరించిన శ్రీవిల్లిపుత్తూరే బృందావనమనీ, తాను ఒక గోపిక అని, చెలికత్తెలందరూ సాటి గోపికలే అనుకుని, ఆ కాలంలో 16వేల మంది గోపికలు ఏ భావన చేత శ్రీకృష్ణ పరమాత్మను పొందారో, అదే భావనతో శ్రీరంగనాథుని సేవించిన విధానాన్నే తిరుప్పావైలో చెప్పింది.

గురు పరంపరతో, ఆచార్యునితో, లక్ష్మీసమేతుడైన పరమాత్ముని పాదపద్మములతో శరణాగతి చేయటమే జీవుని ముఖ్యకర్తవ్యమని, ఆ శరణాగతి ధర్మార్థములకు కాక, లక్ష్మీదేవితో చేరిన పరమాత్ముని పాద పద్మములకు సమస్త కైంకర్యములు చేసి, ఆనందించటమే ఈ జీవాత్మకు ముఖ్య పురుషార్థమని, శ్రీ విశిష్టాద్వైత సారాంశమైన ప్రాప్యప్రాపకములను నిర్ణయిస్తోంది దివ్య ప్రబంధము.

***మొదటి పాశురము -***

మార్గశీర్షమాసములో ముప్పది రోజులు ధనుర్మాసం పేరుతో ఈ మహావ్రతం చేయబడుతున్నది. సాధారణంగా ఒకరికి భగవంతుని యందు అభిముఖము కలిగి, భగవదనుభవముచే ఆనందం కలిగితే, 'ఈ రోజు ఎంత మంచి దినము, భగవదనుభవముచే చాలా ఆనందంగా గడిచిపోయినదే! ఏమి సుదినము!' అని కాలమునే కదా మనం కొనియాడేది. అదే విధంగా గోదాదేవి కూడా మార్గశీర్ష మాసము అనే దివ్యమైన మాసము వచ్చినది అని ప్రత్యేకంగా చెబుతోంది. '**మాసానాం**

**మార్గశీర్షోహం'** అంటే మాసములలో మార్గశీర్ష మాసము నేనే అని గీతాచార్యుడే స్వయంగా చెప్పిన మాసమిది. మనం ఈ వ్రతాన్ని అనుష్ఠించాలని సంకల్పించేసరికి వానలు, ఎండలు లేకుండా సమశీతల కాలమైన చక్కని మాసము, మన మనస్సును అనుసరించే చక్కని మాసమని గోదాదేవి చెబుతోంది.

మాసమెట్లా సాత్వికమైనదో, పక్షము కూడా అలానే. తెల్లవారు జామున లేచి, మనం ఒకరి ముఖము మరొకరికి కనిపించకుండా బాధపడకుండా, ఒకరినొకరు చూసుకుని ఆనందపడే వెన్నెల రాత్రులు కూడా కలిసిరావడం ఏమి అదృష్టం! వెన్నెల రాత్రులతో చేరిన ఈ దినమెంత సుదినం! అని దినాన్ని కొనియాడుతోంది అంటే ఆ తల్లికి భగవద్విషయంలో ఎంత ఆసక్తి కలదో వ్యక్తమవుతోంది కదా! భగవంతుని పొందడానికి వీలైన మాసమును, పక్షమును, దినమును కొనియాడుతున్న వీరి భావము వర్ణనాతీతము కదా! ఏ దినములనైతే భగవదనుభవము లేదో ఆ దినములన్నీ దుర్దినములే కదా! బహుకాలంగా జన్మ పరంపరలో మునుగుతూ వుండే ఈ జీవునకు ఆకస్మిక భగవత్కటాక్షముచే ఆచార్య సాంగత్యము లభించి, ఆచార్యుని ద్వారా పరమాత్మ కొరకు పరితపించు దినమే కదా సుదినము!

'నీరాడప్పోదువీర్ పోదుమినో నేరిళైయీర్' - అంటే, ఇటువంటి సుదినమునందు భగవదనుభవములో మునిగి బ్రహ్మానంద సాగరములో స్నానము చేయుటకు ఇష్టము కలవారందరూ మా గోష్ఠికి రావచ్చు. రమ్మనమని పిలుస్తున్నారు. దీని వలన గ్రహించవలసినదేమంటే పరమాత్మను పొందటానికి జాతి, కుల, వర్గ, మత భేదములు లేవు. స్త్రీలైనా, పురుషులైనా, ఏ జాతివారైనా, ఏ వర్గము వారైనా, పరమాత్మను పొందడానికి అర్హులే! 'శ్రీకృష్ణ పరమాత్మ నాకు కావాలి' అనుకునే వారంతా అధికారులే. కనుక బాల గోపాలుడు కావాలి, వాని పాదపద్మములలో లీనమైపోవాలి అనే భావముకల వారంతా రండి! రండి! - అని పిలుపు నిస్తోంది గోదాదేవి.

-సశేషం

# గుర్వష్టకమ్

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీప్రసాద్ (అమెరికా)

**కళత్రం ధనం పుత్ర పౌత్రాది సర్వం ।**
**గృహం బాంధవాః సర్వమేతద్ధి జాతం ।**
**గురోరంఘ్రి పద్మే మనశ్చే న లగ్నం ।**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిం ॥**

భార్యా, పుత్రులు, బంధువులు, మనుమలు, ధన ధాన్యాలు, గృహారామాలు ఇటువంటివి ఎన్ని కలిగి వున్నప్పటికి కూడా గురుపాదముల యందు మనసు నిలువనిదే వ్యర్థము - అని ఈ శ్లోకం యొక్క తాత్పర్యము.

బాహ్యా ప్రపంచంలో అందరూ ఆకాంక్షించే సంబంధ బాంధవ్యాలను, భోగభాగ్యాలను గురించి ఈ శ్లోకం వివరిస్తుంది. గమనించ వలసిన విషయం ఏమిటంటే వీటన్నిటికీ ఒక గొలుసుకట్టు సంబంధం వుంటుంది. ఒకదానికొరకు మరొకటి కానీ, ఒకదాని వలన మరొకటి కానీ సమకూర్చుకోవాలన్న ప్రయత్నం జరగుతుంది. ముఖ్యంగా వీటన్నింటికీ 'నేను' అన్న భావన కేంద్రబిందువుగా ప్రకటితమవుతుంది. ఒక్క 'నేను' వుండేటప్పటికి, అనేకమైన 'నాది' అన్న విషయాలు బయలు దేరుతాయి. ఈ 'నేను'గా భావించే శరీరం అదృశ్యమైనప్పుడు 'నాది'గా భావించబడిన సంబంధ బాంధవ్యాలు, గృహారామాది క్షేత్రాలు ఒక్కసారిగా త్యజింపబడతాయి.

వీటినే వేదాంత పరిభాషలో 'మధుకైటభులు'గా వివరిస్తారు. 'నేను' అనే ఒక తేనె చుక్క (మధు) వుండేటప్పటికి దాని చుట్టూ ఎన్నో 'నాది'లు 'చీమలు'గా (కీట - భములు) చేరుతాయి. తియ్యని చక్కెర రేణువు (నేను) వున్నంత వరకూ దానిని కీటభము (నాది) తన మొండెమును విడిచినా కూడా తలతో మాత్రం పట్టుకునే వుంటుంది. ఈ 'నాది'లను నిర్మూలించడానికి పరిష్కారం కేవలం వీటికి మూలమైన 'నేను' అన్న భావాన్ని అరికట్టటమే.

ఈ శ్లోకంలో వున్న 'సర్వం ఏతత్ హి జాతం' అన్న ప్రస్తావన

ఇవన్నీ కేవలం ఒక్కదాని నుండే వచ్చాయన్న సూక్ష్మాన్ని తెలియ పరుస్తోంది. ఆ ఒక్క విషయం ఏమయి వుంటుందన్న విచారణ మొదలైనప్పుడు సాధకుడు వీటన్నిటికీ మూలమైన నిజమైన 'నేను' కేవలం తన గురు స్వరూపమేనన్న భావనను పొందుతాడు.

అలా గ్రహించిన సాధకుడు అదే మధుకైటభ తత్వముతో గురుపాద తీర్థామృత ధారలను గ్రోలుతూ, శరీర స్మృతి కూడా మరచి తరించ గలుగుతాడు.

ఆ విధంగా సాధకుడు బాహ్య ప్రపంచంలో వున్నప్పటికీ, ప్రాపంచిక విషయాదులతో మమైక్యం చెందకుండా సర్వాన్ని గురు ప్రసాదముగా భావించాలన్న కర్తవ్యాన్ని ఈ శ్లోకం బోధిస్తోంది.

-సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

*జనవరి 2020*

1 బుధ - ఆంగ్ల సంవత్సరాది. సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.
6 సోమ - ముక్కోటి ఏకాదశి. సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.
10 శుక్ర - పుష్య పూర్ణిమ - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.
14 మంగళ - భోగి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ. రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.
15 బుధ - సంక్రాంతి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.
19 ఆది - శ్రీగురుదశమి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ.
30 గురు - శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా పంచమ వార్షికోత్సవము (2015 మాఘ శుద్ధ పంచమి)

ఫిబ్రవరి 2020

1 శని - రథసప్తమి.
5 బుధ - భీష్మ ఏకాదశి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.
9 ఆది - మాఘపూర్ణిమ - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.
18 మంగళ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.
21 శుక్ర - మహాశివరాత్రి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

# భజ  గోవిన్దమ్

**6. యావత్పవనో నివసతి దేహే, తావత్పృచ్ఛతి కుశలం గేహే।**
**గతవతివాయౌ దేహాపాయే, భార్యాబిభ్యతి తస్మిన్కాయే॥**

ఒంట్లో ఊపిరి ఉన్నంతవరకే 'నువ్వు ఎలా ఉన్నావు?' అని కుశలం అడుగుతారు నీ భార్యాపుత్రులు, బంధు మిత్రులు. నీ శ్వాస ఆగిపోయాక నీ మృత శరీరాన్ని తాకటానికి కూడా వారు భీతి చెందుతారు. ఇవి నిజమైన ప్రేమలు కాదు.



ఈ మోహమైన ప్రేమలపై విముఖత చూపి, అత్యున్నతమైన బ్రహ్మ పదం గురించి విచారణ చేయాలి.

మనస్సును అంతర్ముఖం చేయటంవల్ల, సేవాభావం పెంపొందించుకోవటం వల్ల ప్రపంచ విషయాలపై విముఖత కలుగుతుంది. ఋషులు అలా సాధన చేసి నిజమైన వైరాగ్యాన్ని కలిగి వుంటారు. దేహాత్మ భావనతో ఉండి ఉదరపోషణకై సమయాన్ని వ్యర్థం చేసేవాడికి జీవితంలో పతనం తప్పదు. సాధన కొరకు దేహం దేవాలయంగా భావించాలి. కాని దేహం శాశ్వతం కాదు మార్పులతో కూడినది. దీనికి బాల్య, యౌవన, కౌమార, వృద్ధాప్యమనే అవస్థలు ఉంటాయి.

శరీరమే శాశ్వతం అని భావించారు రాక్షసులు. ప్రహ్లాదుని కుమారుడైన విరోచనుడు దీనిని గ్రహించలేకపోయాడు. 'శరీరమే ఆత్మ కాబట్టి శరీరాన్నే పూజించాలి' అని భావించాడు. కనుక ఈ శరీరంపై వైరాగ్యం పొందాలి అని ఈ శ్లోకం ద్వారా తెలియజేస్తున్నారు శ్రీ శంకరాచార్యులవారు.

జంతువుల చర్మానికి కొంతైనా విలువ ఉంటుంది. కాని

మరణానంతరం మానవ శరీరానికి ఉండదు. పైగా ఎక్కువ సేపు ఉంచితే కుళ్ళు కంపు కొడుతుంది. అతని భార్యే ఆ శరీరాన్ని చూసి భీతి చెందుతుంది.

దీనిని విచారణ చేసి వైరాగ్యాన్ని అలవరచుకొని పరమపద ప్రాప్తి కొరకై సాధన చేయాలి. దేహాన్ని ఒక సాధనా పరికరంగా మాత్రమే చూడాలి. ఈ శరీరం నశించేదే కాని ఇందులో ఉన్న 'శరీరి' శాశ్వతుడు అని గ్రహించాలి.

ఆయువు క్షణం క్షణం తరిగిపోతోంది. సృష్టి కర్త ప్రసాదించిన జ్ఞానేంద్రియాలను భౌతిక సుఖాలు పొందటం కోసం వినియోగిస్తున్నాడు మానవుడు. ఈ విధంగా కాలాన్ని వ్యర్థం చేస్తూ భగవంతుని తలవటానికి 'టైమ్' లేదంటాడు. ఏ కొద్దిమందో ఇంద్రియాలను సంయమనం చేసికొని బ్రహ్మ పదాన్ని కోరుతారు. ఇంద్రియ వ్యాపారాలపై విముఖత చూపి బ్రహ్మ పదం కోసం పాటుపడమని ఉద్బోధిస్తున్నారు శ్రీ శంకరులు.

-సశేషం

***31వ శ్రీ సద్గురు మహాపుణ్యారాధన మహోత్సవములలో***
***15-11-2019 నుండి 23-11-2019 వరకు***
***శ్రీ సద్గురు కోటి నామ పారాయణ***
***1 కోటి, 34 లక్షల, 18వేలు***

***శ్రీ సద్గురు మండల దీక్ష***
***13-10-2019 నుండి 23-11-2019 వరకు***
***శ్రీగురు నామ పారాయణ***
***1కోటి, 51 లక్షల, 62వేల 147***

**మొత్తం నామం ........................ 2, 85, 80, 147**

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**జనవరి 2020**

1 బుధ - ఆంగ్ల సంవత్సరాది. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

6 సోమ - ముక్కోటి ఏకాదశి. ఉత్తరద్వార దర్శనం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

10 శుక్ర - పుష్య పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

14 మంగళ - భోగి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

15 బుధ - సంక్రాంతి - పుష్య బహుళ పంచమి - శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

16 గురు - కనుమ

19 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

23 గురు - మాస శివరాత్రి

24 శుక్ర - అమావాస్య

30 గురు - వసంత పంచమి

**ఫిబ్రవరి 2020**

1 శని - రథసప్తమి

5 బుధ - భీష్మ ఏకాదశి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

9 ఆది - మాఘపూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

18 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

21 శుక్ర - మహాశివరాత్రి - తె.జా 3-30ని॥ శ్రీబాబుకు బృందావనంలో నమకచమక సహిత రుద్రాభిషేకము; 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, 8గం. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు; మధ్యాహ్నం 12గం. సహస్రఘటాభిషేకము; లక్ష బిల్వార్చన; తీర్థప్రసాదాలు,భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామివారి సామూహిక కళ్యాణాలు, అనంతరం స్వామివారి నగరోత్సవం.

23 ఆది - అమావాస్య

26 బుధ - ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీస్వామిని వారి ఆరాధన, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

# చిల్లుల కుండ - పాలూరి కాళీ ప్రసాద్

**నానా ఛిద్ర ఘటోదర స్థిత మహాదీప ప్రభా భాస్వరం**
**జ్ఞానం యస్య తు చక్షురాది కరణద్వారా బహిస్పందతే**
**జానామీతి తమేవ భాంత మనుభాత్యేత్ సమస్తం జగత్**
**తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణా మూర్తయే ॥**

ఒక చీకటి గదిలో ఒక కుండ వున్నదనుకోండి. దాని మీద రకరకాల జంతువుల, పక్షుల ఆకారాలలో చిల్లులు చెక్కబడి వున్నాయి. అందులో ఒక దీపం వెలిగించబడి వుంది. ఇప్పుడు మీరు ఆ కుండని చూస్తే మీకు వెలుగుతున్న ఏనుగు, జింక, నెమలి ఇలా రకరకాల ఆకారాలు కనిపిస్తాయి. అయితే నిజానికి వెలుగుతున్నది లోపల వున్న దీపమే కాని, అక్కడ ఎటువంటి వెలిగే జంతువులు లేవు. ఒక గదిలో దీపం వెలిగిస్తే ఆ వెలుగు గది అంతా నిండిపోతుంది తప్ప, ఆ దీపపు వెలుగుకు ఏ ఆకారం వుండదు. కానీ ఇక్కడ మనకు అదే వెలుగు రకరకాల ఆకారాలతో కనిపిస్తోంది. నిరాకారమైన వెలుగు ఇలా వివిధ ఆకారాలలో కనిపించడానికి కారణం ఏమిటి? ఆ కారణం కుండలోని చిల్లులే. నిజానికి అక్కడ ఏ చిల్లులూ లేని కుండ వుంటే అసలు వెలుగే బయటకు రాదు.

మట్టితో చేయబడి నిండుగా వుండవలసిన కుండలో ఏనుగు ఆకారంలో ఒక భాగం తీసివేయబడింది. అలాగే వివిధ జంతువుల ఆకారాలలో కుండ భాగాలు తీసివేయబడ్డాయి. అలా ఏమీ లేని చోట్ల నుండి మనకు ఆయా ఆకారాలలో కాంతి వున్నట్లుగా కనిపిస్తోంది. లేనిది వున్నట్లుగా కనిపించడాన్నే మాయ అంటాము కదా! ఇలాగే మన శరీరంలో కూడా జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు అనే చిల్లులు వుండటంతో మనలోని జ్ఞాన దీపపు ప్రకాశం ఆయా ఇంద్రియాల ద్వారా బయటకు వెలువడుతోంది. కుండలోని చిల్లులకు స్వయం ప్రకాశం లేనట్లే ఈ ఇంద్రియాలకు కూడా స్వయం సత్తాలేదు. లోపలి జ్యోతి ఆరిపోతే ఇవి ఎందుకూ పనికిరావు.

ఇంకొంచెం లోతుగా ఆలోచిస్తే గదిలో మనకు వెలుగుతున్న జంతువులు వున్నాయన్న భ్రమ కలగాలంటే మనం ఆ గదిలోకి వెళ్ళేసరికే అందులో చిల్లుల కుండ, దానిలో వెలిగే జ్యోతి రెండూ వుండాలి. ఇదే విషయాన్ని గీతాచార్యుడు ఇలా వివరిస్తున్నాడు ...

**ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**
**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్ ॥**
**పురుషః ప్రకృతి స్థోహి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్ ।**
**కారణం గుణ సంగోస్య సదసద్యోని జన్మసు ॥**

(భగవద్గీత 13/20, 21)

ప్రకృతి, పురుషుడు ఇద్దరూ అనాదిగా వున్నవారే. అయితే పురుషుడికి ఏ వికారాలు లేవుగాని, మనకు కనిపించే ఈ ఆకార వికారాలన్నీ ప్రకృతిలోని గుణాలవల్ల ఏర్పడుతున్నాయి. అంటే మనం పైన చెప్పుకున్న ఉదాహరణలో కుండ, దీపము రెండూ మొదటి నుండి ఆ గదిలో వున్నాయి. దీపపు కాంతికి ఎటువంటి ఆకార వికారాలు లేవుగాని, ఆ కనిపించే వివిధ జంతువుల ఆకారాలన్నీ కుండలోని చిల్లుల వలన ఏర్పడుతున్నాయి. ఇంకా ఈ పురుషుడు, ప్రకృతి విడివిడిగా వుంటే ఎటువంటి ఆకారాలు కనబడవు. దీపం కుండ లోపల లేకుండా విడిగా వుంటే మనకు ఆ వెలుగుతున్న జంతువులు కనబడవు కదా!

ఆ దీపపు కాంతి కుండలోని చిల్లుల గుండా ప్రసరించకపోతే, ఆ కాంతికి కూడా ఏ ఆకారమూ వుండదు. అంటే కాంతికి కుండలోని చిల్లులతో ఏర్పడిన సంగం వలన అది ఆకారవికారాలను పొందినట్లుగా కనిపిస్తోందన్న మాట. అదే పైన చెప్పిన రెండవ శ్లోకంలో భగవానుడు వివరిస్తున్నాడు...పురుషుడు ప్రకృతిలోనే వున్నాడు. అలా వుంటూ ఆ ప్రకృతి యొక్క గుణాలను తనవిగా అనుభవిస్తున్నాడు. దీనికి కారణం అతనికి మంచి చెడు జన్మలయందు ఆ యా గుణాలతో ఏర్పడిన సంగమే.

మనం కుండను బయటనుండి చూసినంత సేపూ మనకు ఈ వెలిగే ఆకారాలు కనిపిస్తూనే వుంటాయి. అదే మనం ఆ కుండ లోపలికి వెళ్ళి అసలు జ్యోతిని దర్శించామంటే మనకు అంతటా నిండి వున్న ఆ నిరాకారమైన వెలుగే కనిపిస్తుంది కాని, ఇక అక్కడ ఎటువంటి ఆకారవికారాలకు తావు వుండదు. అలాగే మనం ఈ ప్రకృతిని బయట నుండి చూడటం మాని, మన లోపలికి మనం ధ్యానం ద్వారా ప్రయాణించి, ఆ లోపలి జ్ఞాన జ్యోతిని దర్శించామంటే ఇక మనకు ఈ ప్రకృతిలోని ఆకారవికారాల స్పృహే వుండదు. అట్టి స్థితిని సాధించే వరకు మనం మన సాధనను దక్షిణామూర్తియైన ఆ గురుమూర్తి పర్యవేక్షణలో కొనసాగించవలసినదే.

(గత సంచిక తరువాయి) # కైవల్యోపనిషత్ - రేఖ

సమస్త భూతములను తన యందు, తనను సమస్త భూతమల యందు చూసేవాడు ఆ పరబ్రహ్మాను చేరుతున్నాడు. మరొక మార్గం లేదు. మహాత్ముల దృష్టి ఆ విధంగా వుండటం వల్లనే వారు 'సర్వేజనాః సుఖినో భవన్తు' అని ఆశీర్వదిస్తారు. అంటే ఈ ప్రపంచంలో వున్న మానవ కోటి అంతా కూడా ఆ పరమాత్ముని యొక్క రూపములే, భగవంతుని బిడ్డలే అని వారు అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు.

ఇదే విషయం భగవద్గీతలోని ఆరవ అధ్యాయంలో (ఆత్మ సంయమ యోగం) 29వ శ్లోకం చెబుతున్నది....

సర్వభూతస్థమాత్మానం, సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగ యుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥

వేదముల నుండి ఉపనిషత్తులు, వాటి నుండి భగవద్గీత వచ్చాయి. వీటిని కూడా మానవుడు అర్థం చేసుకోలేడేమోనని, కేవలం భగవన్నామాన్ని జపిస్తే తరిస్తారు అని మహాత్ములు సెలవిచ్చారు. 'రామ' 'కృష్ణ' అనో లేక గురువుల ద్వారా పొందిన 'పంచాక్షరి', లేక 'అష్టాక్షరీ' మంత్రాన్నో ప్రణవంతో జపిస్తే, నిజమైన ఆనందాన్ని పొందగలమని శ్రీత్యాగరాజ స్వామి ఒక కీర్తనలో చెప్పారు. 'తెలిసి రామ చింతన చేయవే ఓ మనసా!' అని ఆలాపించారు.

బాహ్య ప్రపంచంలో హృదయపూర్వకంగా పనులు చేయడం వలన (కర్మణా) గానీ, మన మంచి కోరే ఇతరుల వలన (ప్రజయా)గానీ, ధనము చేత (ధనేన) గానీ ఆ ఆత్మతత్త్వానుభూతిని పొందలేము అని ఇంతకు పూర్వము 3వ మంత్రంలో చెప్పబడింది. 'ఆత్మానుభూతి' నామ జపం వలన సాధకుడు అంతరికంగా అంతరంగంలో పొందగలడు.

మహాత్ములు మన ఇల్లు మనం చక్కబెట్టుకోవడం కోసమే మహాత్ములు ఇన్ని రకాలుగా చెబుతూ మనం ఆ తత్త్వంలో మునిగేటట్లు చేస్తున్నారు. ఈ అనుభూతి, అమృతత్వం కేవలం త్యాగం వల్లనే లభిస్తుంది. నీలో వున్న సత్యాన్ని గుర్తించి, అనుభవించడం ఆత్మానుభూతి. అది ధ్యానావస్థలోనే పొందగలము. ధ్యానావస్థలో ఈ విషయ ప్రపంచమంతా ఆ పరమాత్మలో లీనమైనదని తెలుసుకుంటాము. అదే విధంగా ధ్యానావస్థ నుండి ప్రపంచంలోకి వచ్చినప్పుడు ఆ పరమాత్మానుభూతిని మరచి

పోలేడు మానవుడు. ప్రపంచంలోని ప్రతి అణువులోనూ ఆ పరమాత్మనే దర్శిస్తాడు. మహాత్ములు హిమాలయాలలోను, ఇంకా ఇతర ప్రదేశాలలో తపస్సు చేసి, అక్కడే వుండిపోకుండా వారు తిరిగి వచ్చి, వారు పొందిన తత్వానుభూతిని, సత్యాన్ని, అందరికీ ఆ ఆనందాన్ని అనుభవింపజేయాలని తపనతో మనకి ఎన్ని రకాలుగానో బోధిస్తున్నారు.

ఇటువంటి ఆత్మజ్ఞాని నిరంతరం ఆ స్థితిలోనే వుంటాడు. అలా వుంటూనే ప్రపంచంలో వ్యవహరిస్తాడు. అదేవిధంగా మనం కూడా ఏ పని చేస్తున్నా ఏకాగ్రతతో చేయాలి. ఉన్న తత్వాన్ని సరిగా అర్థం చేసుకుని చేయాలి. ప్రహ్లాదుడు ఎలా అయితే ఏ పని చేస్తున్నా కూడా నారాయణ స్మరణ విడువలేదో, అదే విధంగా మనం కూడా ఆ స్మరణలోనే వుంటూ ధర్మాన్ని నిర్వర్తిస్తూ, ఆ ధర్మంలో వున్న ధర్మ ప్రభువుని మాటిమాటికీ గుర్తిస్తూండాలి. మనలో ఎటువంటి శక్తినిచ్చి నడుపుతున్నాడు, ప్రకృతి లోని లీలల ద్వారా అడుగడుక్కి మనకి ఆనందాన్ని, తృప్తిని ఆ పరమాత్మ మనకు ఇస్తున్నాడని మనం గుర్తించాలి' అని శ్రీమాతాజీ వివరించారు.

-సశేషం

# సత్సంగ సమావేశములు

***శ్రీకాళీవనాశ్రమము, హైదరాబాదుశాఖలో పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమములు 26-1-2020 ఆదివారం నుండి 1-2-2020 శనివారం వరకు నిర్వహింపబడతాయి.***

ప్రతిరోజూ ఉదయం 4గం. సుప్రభాతము, ధ్యానము, ప్రార్థన, 9గం. లకు సంకీర్తన, ధ్యానం, 10-30ని॥ శ్రీరామానుజదాస్‌గారి ప్రవచనము, మధ్యాహ్నం 12గం. సత్సంగం, అనంతరం తీర్థ ప్రసాదములు.

సాయంత్రం 5గం. లకు సంకీర్తన, ప్రార్థన, 6గం. శ్రీమాతాజీవారి బోధామృతము, అనంతరం తీర్థ ప్రసాదములు.

30-1-20 గురువారం - మాఘపంచమి శ్రీసద్గురుదేవుల మంగళమూర్తి ప్రతిష్ఠ వార్షికోత్సవ సందర్భంగా పాదపూజ, భక్తసమారాధన. ఏకాహం.

1-2-20 శనివారం రథ సప్తమి - ఉదయం 6-30గం. సూర్యభగవానుని పూజ, ఆదిత్యహృదయం, మన్యుసూక్తం పారాయణ. ఉదయం 11గం. శ్రీరమా సత్యనారాయణ స్వామి వ్రతము, శ్రీలలితా అష్టోత్తర కుంకుమ పూజల సహిత సామూహిక శ్రీసద్గురు పాదపూజలు, భక్తసమారాధన.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## విశ్వనాధం మావయ్యతో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

గుండుగొలనులో దసరా పూజలు 1948లో ప్రారంభమైనప్పటి నుంచి శ్రీ బాబు ప్రతి పండుగకు విశ్వనాధం మామయ్యను పురోహితుడిగా పెట్టుకున్నారు. దసరా పూజలకే గాక, శివరాత్రి, వినాయక చవితి, శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి యిలా అన్ని పండుగలూ ఎక్కడ జరిగినా, ఆ పూజలకు విశ్వనాధం మామయ్యే 'ఆస్థాన పురోహితుడు'. మామయ్య సమయానికి లేకపోతే వారికి కబురు పంపి, వచ్చే వరకు శ్రీబాబు వేచి ఉండేవారు. దసరా పూజలలో మొదటి రోజు సంకల్పం చేయించటం నుంచి, చివరిలో దీక్షావిరమణ జరిగే వరకూ విశ్వనాధం మామయ్యను ప్రక్కన పెట్టుకునే శ్రీబాబు అన్ని కార్యక్రమాలను నిర్వహించేవారు. ప్రతి రోజు అమ్మ పీఠం వద్ద కుంకుమ పూజ ప్రారంభించే ముందు శ్రీ బాబు జగన్మాతకు గంధాదులతో చక్కగా అలంకారం చేశాక, విశ్వనాధం మామయ్య ముఖంపై గంధంతోనూ కుంకుమతోనూ పెద్ద బొట్టు దిద్దేవారు.



సుగంధ ద్రవ్యాలంటే మామయ్యకు చాలా యిష్టం . జగన్మాత పూజలో ఉపయోగించిన సుగంధ ద్రవ్యాలు ఏమైనా మిగిలి ఉంటే అవి మామయ్యకే. శ్రీ బాబు కూడా ఆయన తల మీద సెంటు పోసేవారు. పూజానంతరం 'అమ్మ' కు పూజ చేసిన పూలలో ఒక పువ్వు తీసుకుని మామయ్య పిలక చివర ముడివేసేవారు. అదంతా మామయ్యకు బ్రహ్మానందంగా ఉండేది. బయటకు వచ్చిన తరువాత, ఎంతో గర్వంగా అందరికి చూపించే వారు.

తమ వద్దకు ఎవరు వచ్చినా, వారికి బాగా తృప్తిగా భోజనం పెట్టిస్తే గాని శ్రీబాబు తృప్తి పడే వారు కాదు. బాగా భోజనం చేసే వాళ్ళంటే శ్రీబాబు చాలా యిష్ట పడేవారు. తామే స్వయంగా వచ్చి నెయ్యి, పరమాన్నము, పిండివంటలు కొసరి కొసరి తినిపించే వారు. మహాత్ములందరిలోనూ యీ ప్రత్యేకత గోచరమవుతుంది. శ్రీరామకృష్ణ

పరమహంస, శ్రీ శారదా మాత వారి దర్శనానికి ఎవరు వచ్చినా, వాళ్ళకు తృప్తిగా ప్రసాదం పెడితేగాని వెళ్ళనిచ్చేవారు కాదు. కన్నతల్లి తన బిడ్డల కడుపు తడిమి పెడుతుందంటారు. మహాత్ములు అంతటితో సరిపుచ్చక, మనసును కూడా తడిమి మంచితో నింపిన దాకా తృప్తి పడరు.

మామయ్య భోజన ప్రియులు. ఆయన విషయంలో శ్రీ బాబు ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. మామయ్యకు జున్నంటే ప్రాణం. అందుకని 'అమ్మ' నివేదన కోసం ఎవరైనా జున్ను పంపితే, అది నివేదన అయిపోయాక కొంచెం జున్ను ప్రసాదమాత్రంగా తీసి, మిగతా జున్నంతా ఉన్న కేరియర్నో, బిందెనో శ్రీబాబు పక్క గదిలో పెట్టించేవారు. వెంటనే మామయ్యకు కాకితో కబురు వెళ్ళేది. మూడో కంటి వాడికి తెలియకుండా పని జరిగిపోయేది.

ఒకసారి రాజమండ్రిలో ఉన్న శ్రీబాబు , గుండుగొలను వెడుతున్న విశ్వనాధం మామయ్యకు , అమ్మకు నివేదన చేసిన పనసతొనలు ఒక బుట్టెడు ప్రసాదంగా యిచ్చి తినిపించి, యింకొక బుట్టెడు పనసతొనలు ఆయన చేతి కిచ్చి 'యివి మా చిరంజీవికివ్వు' అన్నారు. 'అలాగే ' అని ఆ బుట్ట పట్టుకుని బయలుదేరారు మామయ్య.

రైలులో వెడుతున్న మామయ్యకు, బుట్టెడు పనసతొనలు పక్కనే ఉండటం వలన మనశ్శాంతి లేకుండా పోయింది. "బుట్టెడు తొనలున్నాయి గదా! ఒకటో, రెండో నోట్లో వేసుకున్నంతలో పోయేదేమున్నది?" అనుకుని ప్రారంభించారు. తీరా భీమడోలు స్టేషన్లో రైలు దిగేసరికి బుట్టలో రెండో, మూడో తొనలు మిగిలాయి.

"అయ్యో! చిరంజీవి ఏమనుకుంటాడో!" అని మామయ్య నొచ్చుకుని గుండుగొలను వెళ్ళగానే చిరంజీవి రాజుగారితో "ఒరేయ్! చిరంజీవీ! పొరపాటైపోయిందిరా" అన్నారు. చిరంజీవిరాజు గారు "ఏమిటి మామయ్యా? "అని అడిగారు. "నీకివ్వమని బాబు బుట్టెడు పనసతొనలు నాతో పంపాడు రా! ఏదో ప్రసాదంగా ఒకటో రెండో తొనలు తీసుకుందామనుకున్నాను. కానీ తీరా రైలు దిగి చూసేసరికి యీ రెండే మిగిలాయి. అన్ని తొనలూ తినేశానని నాకే తెలియలేదు రా! ఏమీ అనుకోకు" అన్నారు. చిరంజీవి రాజుగారు నవ్వుతూ "భలే వాడివి మామయ్యా ! నువ్వు నాకు సంతోషం కలిగించే పనే చేశావు. ఒకవేళ నువ్వు అన్నీ నాకే తెచ్చి యిచ్చినా, నేను నీకు అవన్నీ యిచ్చేసేవాణ్ణి" అన్నారు.

-సశేషం

(గత సంచిక తరువాయి

-రమణ ప్రసాద్

# విష్ణు కథలు

## శ్రీ శంకర భగవత్పాదులు

కుమారిలభట్టుతో వాదించి పూర్వమీమాంస కంటే ఉత్తరమీమాంస (బాదరాయణ బ్రహ్మసూత్రాలు) గొప్పదని ఒప్పించాలని, అతడి ఆత్మాహుతి ప్రయత్నాన్ని ఆపాలని హుటాహుటిగా అతడు ఉన్న ప్రదేశానికి వెళ్ళాడు శంకరుడు. అప్పటికే కుమారిలుడు తుషాగ్ని మధ్యంలో ఉన్నాడు. శరీరం కొంత కాలింది కాని ఇంకా తెలివిలోనే ఉన్నాడు. శంకరుడు అతడిని స్వస్థుడిగా చేస్తాను బయటకు రమ్మని కోరాడు. "నాకు బ్రతకాలని లేదు. నీతో వాదించాలని లేదు. సమయం మించిపోయింది. నా బదులు మహిష్మతీ నగరవాసి అయిన నా శిష్యుడు మండన మిశ్రుడిని కలిసి ఓడించి అతడిచే భాష్యం వ్రాయించు" అని శంకరునితో చెప్పి ప్రాణాలు వదిలాడు.



**మండనమిశ్రునితో వాదం :**

శంకరుడు శిష్యసమేతుడై ఆకాశమార్గంలో మహిష్మతీ నగరం వెళ్ళాడు. ఆ సమయానికి మండనమిశ్రుడి ఇంట్లో శ్రాద్ధకర్మ జరుగుతోంది. వీధి తలుపులు వేసి ఉన్నాయి. శంకరుడు ఆకాశమార్గాన ఇంటిలో ప్రవేశించాడు. శంకరుడు అనుమతి లేకుండా రాకూడని చోటుకు రావటం చూసి మండనమిశ్రుడు మండిపడుతూ "ఎవరు నీవు? ఎలా వచ్చావు? వెళ్ళిపో" అని గద్దించాడు. "నీతో శాస్త్ర చర్చ చేయాలని ఉంది" అని అడిగాడు శంకరుడు.

శంకర మండనమిశ్రులకు జరిగిన వాద ప్రతివాదాలకు మండనుడి భార్య ఉభయ భారతి మధ్యవర్తినిగా వ్యవహరించింది. వాదంలో శంకరుడు ఓడిపోతే గృహస్థాశ్రమం స్వీకరించాలి, మండనమిశ్రుడు ఓడిపోతే అతడు సన్యాసం

తీసుకోవాలి – ఇదీ షరతు.

ఇరువురి వాదప్రతివాదాలు చాలా రోజులపాటు జరిగాయి. చివరకు మండనమిశ్రుడు ఓడిపోయాడు. అతని భార్య ఉభయ భారతి "నేను ఆయన అర్ధాంగిని. నన్ను కూడా ఓడిస్తేనే కాని మండనుడు ఓడిపోయినట్లు కాదు" అని సవాలు విసిరింది. శంకరుడు "సరే" అన్నాడు. వారి వాదం కూడా ఎన్నాళ్ళకూ తెగలేదు. కాని ఆమె ఓడిపోయే సూచనలు కనిపించాయి. అప్పుడు ఆమె ఓటమిని అంగీకరించటం ఇష్టంలేక ఒక ఎత్తు వేసింది. బాల సన్యాసి కనుక ఇతనికి కామశాస్త్రం తెలిసి ఉండదు. అందుచేత ఆ శాస్త్రంలో ప్రశ్నలు వేస్తే అతడు తప్పక ఓడిపోతాడు అని ఆమె ఆలోచించి, "కామకళలు ఎన్ని? వాటి స్వరూపం ఏది? వాటి స్థానం ఏది? శుక్ల కృష్ణ పక్షాలలో కామ కళలు ఎలా మారుతుంటాయి? అవి పురుషులలో ఎలా ఉంటాయి? స్త్రీలలో ఎలా ఉంటాయి? ఇత్యాది ప్రశ్నలు వేసింది.

శంకరుడు ఖంగుతిన్నాడు. ఒక నెల గడువు కోరాడు. అక్కడనుండి వెళు తుంటే ఒకచోట ఒక రాజు శవం కనపడింది. దాని చుట్టూ అతని భార్యలు చేరి ఏడుస్తున్నారు. మంత్రులు, భటులు, బంధుమిత్రులు అంతా వారిని పర్యవేష్ఠించి ఉన్నారు. శంకరుడికి ఒక ఆలోచన వచ్చింది. శిష్యులతో తన శరీరాన్ని భద్రంగా కాపాడుతూ ఉండమని చెప్పి పరకాయ ప్రవేశ విద్యతో రాజు మృతదేహంలో ప్రవేశించాడు. చితి మీద ఉన్న రాజు నిద్రలోంచి మేల్కొన్నట్లు లేచి కూర్చున్నాడు. అందరికి ఆశ్చర్యంతో పాటు సంతోషం కలిగింది. రాజును కోటలోకి తీసుకు వెళ్ళారు.

-సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD